చివరి శ్రావణ శుక్రవారం పూజలు

నల్లకుంట: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో రద్దీ నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నల్లకుంట శంకరమఠంలో శారదాంబ స్వర్ణ కచిత(బంగారు చీర) అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అలాగే న్యూ నల్లకుంటలోని శ్రీసీతా రామాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పర్వదినం కావడంతో చాలా మంది తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మహిళలు ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

భువనేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని భువనేశ్వరిదేవికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే చివరి శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ ఈవో దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, శర్మ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శారద మహిళా మండలి ఆధ్వర్యంలో వ్రతం..

శారద మహిళా మండలి ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎం.శేషమ్మ, కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలు లలిత, పూర్వ అధ్యక్షురాలు పద్మావతి, పద్మసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


న్యూరామాలయంలో సరస్వతిమాతకు పూజలు


శారద మహిళా మండలి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు


ఆలయంలో లలిత సహస్రనామా పారాయణం చేస్తున్న మహిళలు


శంకరమఠంలో స్వర్ణ కచిత అలంకరణలో శారదామాత

అభ్యుదయ భావ కవిత్వంలో మేటి తిలక్


బాల గంగాధర్ తిలక్ యాదిలో కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పొత్తూరి సుబ్బారావు

చిక్కడపల్లి: తొలిరోజుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతో భావ కవిత్వం వైపు అడుగులు వేసినా ఆ తర్వాత అభ్యుదయ కవిత్వంలో మేటిగా బాల గంగాధర్ తిలక్ గుర్తింపు పొందారని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో అభ్యుదయ రచయిత దేవరకొండ బాలగంగాధర్ తిలక్ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌గుప్తా పాల్గొని మాట్లాడుతూ.. తిలక్ కథలు, కవిత్వం సమాజ హితం కోసం ఉంటాయని అన్నారు. రాసిన సాహిత్యం 'రాసిలో కొంచమే అయినా వాసిలో అపురూపమైనవి'అని తెలిపారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ... వచన కవితా ఉద్యమంలో కుందుర్తికి సహచరుడు తిలక్ అని అన్నారు. చిన్న వయస్సులోనే ఆయన మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కళాభిమాని వెంకటరావు, గాయని గరిమెళ్ళ సీతాదేవి పాల్గొన్నారు.

పీటీఎల్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లోని పార్ట్ టైం లెక్చరర్స్ (పీటీఎల్) సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ (పీటీఎల్) అధ్యక్షుడు సోమేశ్వర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్‌ను కలిసి వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. పర్మనెంట్ అధ్యాపకుల నియామకాలకు అర్హత ఉండి రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఎంపికైన పార్ట్ టైం అధ్యాపకులను చిన్న చూపుచూడటం తగదన్నారు. వారిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని,ప్రతినెల రూ.50వేల చొప్పున 12 నెలల వేతనం చెల్లించాలని కోరినట్లు తెలిపారు. పీటీఎల్ నేతలు జానకీరెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, కరుణకర్, చీకట్లో శ్రీనివాస్, సురేశ్, జీవన్, ప్రశాంత్, వేణు పాల్గొన్నారు.

'కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే'

గాంధీఆస్పత్రి : కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల హామీని తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచి, కుల గణన చేపట్టాలనే డిమాండ్లతో బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్‌పటేల్ గాంధీ ఆస్పత్రిలో కొనసాగిస్తున్న ఆమరణ నిరాహారదీక్ష ఆరో రోజుకు చేరింది. ఆయన శుక్రవారం వారిని పరామర్శించి, మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ దీక్ష చేపట్టిన నాయకుల ఆరోగ్యం క్షీణించక ముందే వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. బీసీ ఉద్యమానికి తమవంతూ సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. పలు బీసీ సంఘాలకు చెందిన నాయకులు దాసు సురేశ్, కాసాని శ్రీనివాస్‌రావు, చామకూర రాజు, కేవీ గౌడ్, ఎర్ర రమేశ్ అంబాల నారాయణ గౌడ్, కొంగర నరహరి, విజయ్ కుమార్, జీడీ వెంకటేశ్, చెరుకు శివ, సుజ్జి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు కీలకం కావాలి

పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వెంకట నర్సింహారెడ్డి



కవాడిగూడ/చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు తమవంతు పాత్ర పోషించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వెంకట నర్సింహారెడ్డి కోరారు. దోమలగూడలోని పింగళి వెంకట్‌రాంరెడ్డి కన్వెన్షన్‌హాల్‌లో శుక్రవారం పీఆర్‌టీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణ, సన్మాన సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కమలాకర్‌రావు విద్యారంగానికి విశిష్టమైన సేవలందించారని అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేశారు. సంఘాలు కేవలం ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా మారుతున్న సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా తగిన పాత్ర పోషించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులతో పాటు బకాయిపడ్డ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, పూల రవీందర్, వెంకట్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు సదానంద్‌గౌడ్, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్లా, రాఘవరెడ్డి, టీజీఓ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగులపై లింగ వివక్ష మానుకోవాలి

ముషీరాబాద్: కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగులపై లింగ వివక్ష మానుకోవాలని ప్రగతీ శీల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యా శాఖ కమిషనరేట్ (స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర శిక్షా అభియాన్) ముందు ఉద్యోగులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్రంలోని 485 కేజీబీవీల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు. ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ... బేసిక్ పే నిర్ణయించి వేతనాలు పెంచాలన్నారు. అదే విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ వయస్సును 65 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సంస్థలన్నీ మహిళా ఉద్యోగులతో నడుస్తున్న పాఠశాలలు, కళాశాలలని ఈ విద్యా సంస్థల్లో లింగ వివక్ష కొనసాగుతోందని అన్నారు. ఈ లింగ వివక్షను మానకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, అశోక్, సుధాకర్, సాంబశివుడు, వెంకటేష్‌లతో పాటు అసోసియేషన్ నాయకులు షాహిదా, వీరమణి, అరుణ, మౌనిక, మధుర, సుశీల, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యా శాఖ కమిషనరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్న కేజీబీవీ నాన్‌టీచింగ్ ఉద్యోగులు

టాయిలెట్స్ అధ్వానం

• సుందరయ్య పార్కులో 2 నెలలుగా మరమ్మతులు • పట్టించుకోని సంబంధిత అధికారులు


సుందరయ్య పార్కులో కొనసాగుతున్న టాయిలెట్స్ మరమ్మతులు

నిరుపయోగంగా ఉన్న మహిళా టాయిలెట్స్



నిరుపయోగంగా ఉన్న స్త్రీ, పురుషుల టాయిలెట్స్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కులో టాయిలెట్స్ పూర్తిగా అధ్వానంగా మారాయి. ప్రతి రోజు సుమారు ఐదు వేల మంది వరకు వాకర్స్ వచ్చిపోతుంటారు. టాయిలెట్స్ లేకపోవడంతో వాకర్స్ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత రెండు నెలలుగా టాయిలెట్స్ మరమ్మతులు చేపడుతున్నారు. 10–15 రోజుల్లో పూర్తిచేయాల్సిన టాయిలెట్స్‌ను రెండు నెలలుగా కొనసాగించడంతో వాకర్స్ అంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఏ టాయిలెట్స్ కూడా అందుబాటులో లేవు. ప్రత్యేకంగా మహిళలకే నిర్మించిన టాయిలెట్స్‌కు గానీ, స్త్రీ, పురుషులకు నిర్మించిన టాయిలెట్స్ గానీ వినియోగంలో లేవు. ఎందుకంటే వాటికి సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఎవరు వాటిని వినియోగించడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా టాయిలెట్స్ మరమ్మతు పనులు నిర్వహించడం పట్ల పలువురు వాకర్స్ విస్మయానికి గురవుతున్నారు. కాంట్రాక్టర్ గానీ, సంబంధిత అధికారులు గానీ పూర్తిస్థాయిలో చొరవ చూపడం లేదని విమర్శలు ఉన్నాయి.

నిర్మాణం పూర్తి చేయాలి



పది రోజుల్లో పూర్తి చేయాల్సిన టాయిలెట్స్‌ను నెలల తరబడి కొనసాగించడం బాధాకరం. అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు ఐదు వేల మంది పార్కుకు వస్తారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– బి.వెంకటస్వామి, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. తెలంగాణ ఉద్యమంతో పాటు రాజకీయ, వర్సిటీల పరిస్థితి, ఇతర అంశాలపై చర్చించారు. యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏండ్లు పెంచేందుకు ప్రభుత్వంతో చర్చింఆలని కోరినట్లు ఔటా జనరల్ సెక్రెటరీ ప్రొ.సురేందర్ రెడ్డి తెలిపారు.

రైల్వే కుటుంబాలకు అండగా క్రెడిట్ సొసైటీ

సికింద్రాబాద్: రైల్వే కుటుంబాలకు క్రెడిట్ సొసైటీ అండగా ఉంటున్నదని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి పేర్కొన్నారు. సొసైటీ సభ్యుడు, రైల్వే ఆసుపత్రి ఉద్యోగి జంగయ్య మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులకు మంజూరైన మ్యూచ్‌వల్ బెనిఫిట్ ఫండ్ రూ. 3.08 లక్షల చెక్కును శుక్రవారం సొసైటీ కార్యాలయంలో అందించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీకి జంగయ్య బకాయిపడిన రుణం రూ.3 లక్షలు కూడా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు.

పెళ్లి ఇష్టం లేదని..

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

సికింద్రాబాద్: పెళ్లి ఇష్టం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్–చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌పై మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడు ఘట్‌కేసర్‌కు చెందిన కేవీ నరసింహమూర్తి (38)గా నాచారంలోని పవర్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతడికి కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం బలవంతంగా పెళ్లికుదిర్చి నిశ్చితార్థం కూడా చేశారు. దీంతో మనస్తాపం చెందిన నరసింహమూర్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

బౌద్ధనగర్: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని ఈస్ట్ జోన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారాసిగూడలోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి మాట్లాడారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీ షీటర్లు అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి


జవహర్‌నగర్ టీఆర్టీలో వాటర్‌వర్క్స్ అధికారులతో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అసలే జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి.. మరో పక్క మురుగు రోడ్లపై పొంగిపొర్లుతున్నాయి. దీంతో దోమల బెడద పెరిగిపోవడంతో జవహర్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ పావని వాటర్‌వర్క్స్ అధికారులకు తెలిపారు. శుక్రవారం జవహర్‌నగర్ టీఆర్టీ క్వార్టర్స్‌లోని బస్తీ దవాఖానా పరిసర ప్రాంతాల్లో వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర మాట్లాడుతూ... జవహర్‌నగర్ టీఆర్టీ ప్లేగ్రౌండ్ ప్రాంతంలో మురుగు తరచూ పొంగిపొర్లడంతో తీవ్ర దుర్గంధం నెలకొంది. దీంతో స్థానికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వాటర్‌వర్క్స్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సురేష్, నవీన్‌కుమార్, దొనేటి సత్యం, ఆనంద్‌రావు, శివకుమార్, సాయికుమార్, స్థానికులు కృష్ణ, ప్రకాష్, మనోజ్, సివరేజీ సూపర్‌వైజర్లు సిబ్బంది, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ దీక్షకు గౌడ ఐక్య సాధన సమితి మద్దతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ ఆమరణ నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం దీక్ష చేస్తున్న నాయకులను గాంధీ ఆస్పత్రిలో పరామర్శించి సంఘీభావం తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం సమగ్ర కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.


గాంధీ ఆస్పత్రిలో దీక్ష చేస్తున్న నాయకులను పరామర్శిస్తున్న అంబాల నారాయణగౌడ్

ఈ కార్యక్రమంలో నాయకులు చామకూర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు 2న

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మిగిలిన సీట్లకు వచ్చే నెల 2న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. గతంలో మిగిలిన సీట్లను మరుసటి సంవత్సరం డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కల్పించారు. కానీ కాలేజీ చరిత్రలో తొలిసారిగా మిగిలిన సీట్లకు టీజీఈఏపీసీఈటీ–2024 అధికారుల ఆదేశాల మేరకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాల్లో మిగిలిన సీట్ల వివరాలు. బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో 6 సీట్లు, మెకానికల్–1, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో మిగిలిన 19 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే 2న కాలేజీలో జరిగే స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎంసెట్ ర్యాంక్ లేదా ఇంటర్‌లో మార్కుల శాతంతో సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలి

ముషీరాబాద్: నగరంలో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. రాకేష్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో డెంగీ, మలేరియా కేసులు లేవని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏఎన్ఎం లక్ష్మీబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇరిసెట్, ఎంఎంఎంయూటీ ఒప్పందం

లాలాపేట: సికింద్రాబాద్ ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలీ కమ్యునికేషన్స్ (ఇరిసెట్) గోరఖ్‌పూర్‌లోని మదన్ మోహన్ మాల్వియా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎంఎంయూటీ) అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని ఇరిసెట్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ, ఎంఎంఎంయూటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జైప్రకాష్ సైనీ రైల్వే సిగ్నలింగ్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటక్షన్ సిస్టం–కవాచ్ ఇన్ బీటెక్ ప్రోగ్రాంను ప్రవేశపెట్టేందుకు పరస్పరం ఒప్పంద పత్రాలపై సంతకం చేసి మార్చుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు రాజేశ్‌కుమార్ పాండే, గౌరవ్ గోవియల్, యూనివర్సిటీ డీన్ ప్రొ. పీకే మిశ్రా, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద చెట్ల కొమ్మల తొలగింపు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం చౌరస్తా భరత్‌నగర్ ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ డివిజన్ కన్వీనర్ రాజేష్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు కుషాల్‌గౌడ్, ఆయూష్, రాహుల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజీయూఎస్ భోలక్‌పూర్ కన్వీనర్‌గా పృథ్వీరాజ్

ముషీరాబాద్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి(బీజీయూఎస్) భోలక్‌పూర్ డివిజన్ కన్వీనర్‌గా బీజేపీ నాయకుడు పృథ్వీరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో జరిగిన సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ గణేష్ మండప నిర్వాహకులతో ఈనెల 31వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండప నిర్వహకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హిందువుల ఐక్యతను చాటేందుకు గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దూరి శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, అనిల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

నల్లకుంట: కాచిగూడకు చెందిన యథార్థ అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందాడు. అతడి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న కార్పొరేటర్ కన్నె ఉమా, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం కార్పొరేటర్ కన్నె ఉమా లబ్ధిదారుడి తల్లి శశిప్రభకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా. ఎన్.గౌతంరావు, బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కృష్ణకుమార్, అరవింద్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ బాల్‌రెడ్డికి నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీవేత అల్వాల్ బాల్‌రెడ్డి వర్ధంతి సభను నవభారత నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు ప్రముఖులు పాల్గొని తమ కవిత్వాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త అల్వాల్ దేవేందర్‌రెడ్డి, నవభారత నిర్మాణం సంఘం అధ్యక్షుడు సూరెపల్లి రవికుమార్, అమృత్‌కుమార్ జైన్, కొండా రవీందర్, గిరి పట్ల, సోమయాజులు, కోటేశ్వర్‌రావు, వీణా, సుధాఠాకూర్, వడ్డెపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ బాల్‌రెడ్డికి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం